క్లుప్తంగా

పేద విద్యార్థులకు సాయం అందించాలి



కార్యక్రమంలో పాల్గొన్న మానవత సభ్యులు

ఉంగుటూరు: పేద విద్యార్థులకు సాయమందించాలని మానవత సంస్థ రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన మానవత సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, దొంతంశెట్టి సత్యనారాయణ, మండల శాఖ కార్యదర్శి రాజాని సతీష్, కోశాధికారి గంజి రవి, మానవత సభ్యులు బొమ్మిడి అపారావు, శీతాల సత్యనారాయణ, రామిరెడ్డి వంకటరెడ్డి, మందా జయలక్ష్మి, పొండ్రాకుల శ్రీనివాసరావు, గుండమోలు తాతయ్య, సుబ్బారావు, రామకృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



రాట్నాలమ్మ అమ్మవారు

పెదవేగి: రాట్నాలమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాల కుంటకు చెందిన శ్రీరాట్నాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలలనుంచి పెద్ద సంఖ్యలో అమ్మవారి దేవస్థానానికి భక్తులు విచ్చేసి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం వారి చిన్నారులకు అక్షరాభ్యాసనలు, నామకరణలు చేశారు. ఇందులో భాగంగా ఈ వారం పూజా రుసుముల వలన రూ.41,100, విరాళాల వలన రూ.1401, లడ్డూ ప్రసాదం రూ.29,805, పులిహోర అమ్మకం రూ.1380, ఫొటోలు అమ్మకం వలన రూ.4165, మొత్తం ఆదాయం రూ.77,851 లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న రమేష్

దెందులూరు: జాతీయ రహదారిపై కొమిరేపల్లి గరుడ హోటల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. ద్విచక్ర వాహనంపై వెళుతున్న అంబాజీపేటకు చెందిన మాచవరం మోకా రమేష్‌ను వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌లో వైద్య చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం



గవరవరంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరంలో ఆదివారం కేన్సర్ స్క్రీనింగ్ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం 150 మందికి పైగా స్త్రీలకు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. మహిళలలో ఎదురవుతున్న కేన్సర్ సమస్యల గురించి అవగాహన కల్పించారు. మాజీ జెడ్పీటీసీ ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి మహిళలకు సేవలు అందించి బ్రెస్ట్, గర్భాశయ ముఖం కేన్సర్ గురించి వివరించారు. మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహ రాజు సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ముగ్గురు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ. 3,11,351 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంనకు చెందిన దండుబోయిన వీరవెంకట సర్వేశ్వరరావు రూ.1,00,116, ఖమ్మం జిల్లా సత్యన్నారాయణపురంనకు చెందిన చాపలమడుగు దానేశ్వరరావు రూ.1,00,116, ఏలూరుకు చెందిన మారుశీళ్ల కృష్ణారావు రూ.1,11,119 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ నట రాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్‌లను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

గంపెడాశలతో సార్వా సాగు ప్రారంభం

- తొలి ఏడాది నిరాశ పరిచిన అన్నదాత సుఖీభవ
- కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించేనా?
- గత సార్వా, దాళ్వా సాగులో మిగిల్చిన అప్పులు
- ఆశగా నగదు కోసం ఎదురు చేస్తున్న రైతులు



దుద్దేపూడిలో సార్వా సాగులో వేసిన వరి నాట్లు

భీమడోలు: అన్నదాతలు గంపెడాశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. గత సార్వా, దాళ్వా సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతాంగం ఈ ఏడాది సాగులో ఆశాజనకరమైన దిగుబడులు పొంది గట్టెక్కాలని సాగుకు సమాయత్తమయ్యారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సర్కారు సాయం చేస్తుందన్న ఆశతో సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా అన్నదాత సుఖీభవ పథకం పేరు ఉంది గాని ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు విమర్శిస్తున్నారు. దీంతో వారు అప్పులు చేసి సాగు ప్రారంభించాల్సిన దుస్థితి ఏర్పడింది. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలు పెరగడం, కూలీల ఖర్చులతో ప్రతి ఏటా సాగు వ్యయం పెరుగుతుంది. దిగుబడులు రాక, వరికి మద్దతు ధర పెంచకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. తరాలుగా చేస్తున్న వ్యవసాయాన్ని వదిలి వేరే పనులు ఏం చేస్తామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేల పెట్టుబడి సాయం నగదు కోసం రైతులు ఎదురు చేస్తున్నారు. గత ఏడాది కూటమి సర్కార్ రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో ఒక్క పైసా కూడా జమ చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు, కౌలు రైతులకు ఠంచన్‌గా పెట్టుబడి సాయాన్ని సాగు ఆరంభంలోనే వారి బ్యాంకు ఖాతాల్లోకి రూ.13 వేలు జమ చేయడంతో రైతులు ఉత్సాహంగా పనులు ప్రారంభించేందుకు ఈ సొమ్ములు భరోసా ఇచ్చేవి.

వర్షాల రాక.. సాగుకు ఊతం

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు, కౌలు రైతులు సాగును ప్రారంభించారు. గోదావరి కాలువకు నీటి విడుదలతో పాటు వాతావరణం అనుకూలించడంతో రైతన్నలు సార్వా పనుల బాట పట్టారు. ఎకరం పొలంలో నారుమడిని వేసేందుకు రైతులు, కౌలు రైతులకు సాగు భారం ప్రారంభమవుతుంది. ఐదు సార్లు దుక్కి దున్నాలంటే రూ.5 వేలు, విత్తనాలు, గట్టు సరి చేయడం, బాగు చేయడం, నారుతీత, వరి నాట్లు, కలుపు తీత, ఎరువులు వేయడం, పురుగు మందులు పిచికారీ చేయడం, పంట కోత నేపథ్యంలో వరి కోత మిషన్, ఆ ధాన్యాన్ని రోడ్లపై తీసుకొని రావడం వంటి పనులకు రూ.30 నుంచి రూ.35 వేల వరకు రైతులకు ఖర్చు అవుతున్నాయి. ఆరుగాలం పండించిన పంట చేతికందే దశలో వర్షాలు రావడంతో పంట నీట పాలై తీరని నష్టం వస్తుందని, దీంతో ప్రతి ఏటా సాగులో అప్పులే మిగులుతున్నాయని వారు వాపోతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రైతులకు రూ.4 నుంచి రూ.5 వేల వరకు మిగులుతుందని, లేకుంటే అదీ లేదని రైతులు వాపోతున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పాక్షిక డెల్టా మండలాలైన భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో 60 శాతం కాలువ నీటిపై, 40 శాతం బోర్ల కింద సాగు చేస్తున్నారు. నిడమర్రు, గణపవరం మండలాల్లో పూర్తిగా కాలువ నీటిపై ఆధారపడి రైతులు సాగు చేస్తున్నారు. బోర్ల కింద రైతులు ఇప్పటికే నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. డెల్టా ప్రాంతాల్లో నారుమడులు వేస్తున్నారు. భీమడోలు మండలంలో రైతులు ఎక్కువగా పీఎల్ 1100, ఎంటీసీ 1318, స్వర్ణ రకాలతో సాగును ప్రారంభించారు.

> **ఆగస్ట్ 15వ తేదీలోగా సార్వా నాట్లు పూర్తి చేస్తాం**
>
> 
>
> ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు వేసేందుకు అన్ని చర్యలు చేపడుతుంది. వర్షాలు సకాలంలో పడడంతో రైతులు సాగు పనులను చేపట్టారు. మండల వ్యాప్తంగా 13 వేల ఎకరాల విస్తీర్ణం సాగు చేస్తున్నారు. వాటిలో మెట్ట ప్రాంతాలైన అంబర్‌పేట, దుద్దేపూడి గ్రామాల్లోని బోర్ల కింద 66 ఎఎకరాల్లో నాట్లు వేశారు. 360 ఎకరాల్లో నారుమడులు వేశారు. ఈ ఏడాది సాధారణ వర్ష పాతానికి మించి వర్షపాతం నమోదైంది. జూలై 15వ తేదీ నాటికి నారుమడులు పూర్తి చేసి ఆగస్ట్ 15వ తేదీ నాటికి నాట్లు పూర్తి చేస్తాం. ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని ఏర్పాట్లు చేశాం.
>
> – ఎస్‌పీవీ ఉషారాణి, మండల వ్యవసాయాధికారిణి, భీమడోలు



డెల్టా ప్రాంతం పాతూరు వద్ద నారుమడిని సిద్ధం చేస్తున్న రైతులు



అంబర్‌పేటలో ఏపుగా ఎదిగిన నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పాడైన ఫిల్టర్ బెడ్లు



ట్యాంకు నుంచి వచ్చే మంచినీరు ఇదే

ఉంగుటూరు: రావులపర్రు గ్రామంలో ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేసిన మూడు నెలలకే మురికినీరు వస్తోంది. దీంతో ప్రజ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల క్రితం గ్రామంలోని మంచినీటి ఫిల్టర్ బెడ్లు ఇసుక మార్పుచేసి మరమ్మతులు చేశారు. పంచాయతీ నిధులతో ఈ పనులు చేశారు. మరమ్మతులు చేసిన మూడు నెలలకే అవి పాడై కుళాయిల ద్వారా మట్టి, సుద్ధ కలిసిన మురికినీరు వస్తోంది. దీంతో ఈ నీరు తాగి ప్రజలు అస్వస్థతకు గురువుతున్నట్లు, ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఒకసారి ఫిల్టర్ బెడ్లు వేస్తే కనీసం రెండు సంవత్సరాలు పని చేయాల్సి ఉంది. అలాంటిది మూడునెలలకే ఫిల్టర్ బెడ్లు పని చేయక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎస్ఈ, పంచాయతీ సెక్రటరీకి ఫిర్యాదు చేసినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకు డు గాది వెంకట రమణ వివరించారు. ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు వినియో గించిన పంచాయతీ సొమ్ములు దుర్వినియోగం అయినట్లేనా అని అంటున్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు కె.అచ్చిబాబు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చాలని, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా జాబ్ కేలండర్ విడుదల చేయలేదని, దీంతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అటవీశాఖలోని 800 బీట్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆర్థికశాఖ అనుమతినిచ్చినా ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో 15 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయ వ్యవస్థలో ఖాళీగా ఉన్న 3 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కెమెరా సృష్టికర్త డాగూరే సేవలు చిరస్మరణీయం



డాగూరే, కలాం విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు

భీమడోలు: ఫొటో గ్రాఫర్ల జీవితాల్లో వెలుగులు నింపిన కెమెరా సృష్టికర్త, ఫోటోగ్రఫీ రూప కర్త డాగూరే సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు సంత మార్కెట్ వద్ద ఆదివారం డాగూరే జయంతిని పురస్కరించుకొని ప్రపంచ కెమెరా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాగూరే, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జులై 4, 5, 6వ తేదీల్లో విజయవాడ కానూరు వద్ద జరిగే ట్రేడ్ షో ఎగ్జిబిషన్ బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ద్రాక్షారపు శ్రీరామ్, గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మరావు, పుల్లాబోట్ల రామ్మూర్తి, ఏవీ రంగారావు, డి.శ్రీనివాస్, సురేష్, ఎ.నాగరజాజు, చిన్ని, పి.నరేష్, సభ్యులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు కృష్ణ భగవానుడు



కృష్ణుడి గురించి ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

పెదవేగి: గురు పౌర్ణమికి ఏకైక ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. జులై 10వ తేదీన గురు పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పెదవేగి మండలంలోని పెదకడిమి గ్రామ రామాలయం వీధి పరిసరాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా పూజించాలని త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్ కుమార్, సభ్యులు కోటేశ్వరరావు, అశోక్, రామాంజనేయులు, శ్రీకాంత్, ఎస్.లైలా పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలే కీలకం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: పార్టీ మరింత బలోపేతానికి గ్రామ స్థాయి కమిటీలు కీలకపాత్ర పోషిస్తాయని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయంలో మండల, గ్రామ కమిటీల ఏర్పాటుపై దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



తేరా ఆనంద్



ప్రసాద్‌బాబు



అప్పన ప్రసాద్

నాయకులకు అభినందన

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులుగా ఎన్నికైన కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, అప్పన ప్రసాద్, జానంపేట ప్రసాద్ బాబులను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం అభినందించారు. ఆయనతో పాటు జెడ్పీ వైస్ చైర్మన్ పెరుమాల విజయ్ బాబు, జెడ్పీటీసీలు నిట్టా లీలా నవకాంతం, మండలి సరస్వతి, ఎంపీపీలు బత్తుల రత్నకుమారి, తాత రమ్యశ్రీ, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ నాయకులు ముంగర సంజీవ్ కుమార్, పల్లెం ప్రసాద్, మండలి కొండలరావు, ప్రభాకర్‌రావు, ఎం.సూర్యనారాయణరావు, పోకల రాంబాబు, తోత్తడి వేద కుమారి, పాలడుగు సత్యనారాయణ తదితరులు వారిని అభినందించారు.



వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కామిరెడ్డి నానిని అభినందిస్తున్న నేతలు

ఆత్మీయ కలయిక

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని ఆయన కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఏపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పి.జీవన్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. తనను పార్టీ తరపున రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు అబ్బయ్య చౌదరికి పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరిని జీవన్ కుమార్ సత్కరించి, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నసమారాధన

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కల్పవృక్షం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ నేత, పారిశ్రామికవేత్త దివంగత పోతన శేషగిరిరావు శేషు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణేష్ రాయుడు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఒక రోజుకు సరిపడా భోజన వసతి పౌష్టికాహారాన్ని సమకూర్చారు. కొయ్యలగూడెం, కన్నాపురం, పోలవరం, గొల్లగూడెంలోని వృద్ధాశ్రమాలకు శేషగిరిరావు సహాయ సహకారాలు అందించారని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు పేర్కొన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజా గణేష్ రాయుడు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మాజేటి సత్యనారాయణ, దారం సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయాలు

టి.నరసాపురం: మండలంలోని మక్కినవారిగూడెం పరిధిలోని సున్నపురాళ్లపల్లి ఫీడర్, టి.నరసాపురం పరిధిలోని ఆర్‌కేఆర్ గూడెం ఫీడర్‌లలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున ఈ నెల 30 నుంచి జూలై 4వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చినుకు పడితే రహదారి ఛిద్రం



భీమడోలు వంతెన నుంచి పెదలింగంపాడుకు వెళ్లే మెయిన్ రోడ్డు



పెదలింగంపాడు గ్రామంలో గోతులతో నిండిన రోడ్డు

అధ్వానంగా దళిత గ్రామాలకు వెళ్లే రోడ్డు

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికి పాడైన రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు నరకయాతనను అనుభవిస్తున్నారు. గత ఎన్నికల్లో రోడ్లు వేస్తామని హామీలు ఇచ్చిన పాలకులు ఏడాది గడిచినా తమకు పట్టనట్లు వ్యవహరించడంతో గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మండలంలోని రోడ్ల పరిస్థితి చూస్తే అవి పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తుంది. గుంతలు, పగుళ్లు, కొట్టుకుపోయిన పైపూతతో రోడ్లు మట్టి కుప్పలుగా మారిపోయాయి. భీమడోలు వంతెన వద్ద నుంచి పెద్దలింగంపాడు వైపుగా వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు వర్షాలకు ఛిద్రంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చినుకు పడితే ఆ రోడ్డుపై రాకపోకలు సాగించడం కష్టంగా మారి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు.

ప్రమాదాలకు నెలవు.. ఈ రహదారి

భీమడోలు వంతెన నుంచి చినలింగంపాడు మీదుగా పెదలింగంపాడు గ్రామాలను కలిపే కొల్లేరులోని ఆక్వా చెరువులకు వెళ్లే ఈ రోడ్డు ప్రజల పాలిట ప్రమాదాలకు నెలవుగా మారింది. తొలకరి వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమవడంతో ఆ గ్రామానికి అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వాహనాలు వెళ్లడం కష్టమవుతుంది. ఈ పంచాయతీ రాజ్ రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉండడం, శివారులో ఆక్వా చెరువులు విస్తరించడం వలన నిత్యం భారీ వాహనాలు ఈ రహదారి వెంబడి రాకపోకలు సాగిస్తున్నాయి. అదమరిస్తే పక్కనే ఉన్న పంట బోదెల్లో పడాల్సిందే. భారీ వాహనాల వలన సుమారు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే దళిత గ్రామాలైన చినలింగంపాడు, పెదలింగంపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా భీమడోలు గ్రామానికి చెందిన రైతులు సాగు చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు దుస్థితిపై పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని భీమడోలు ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ కోరారు.